

ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలి

వినుకొండ(నూజెండ్ల) : ఉద్యాన పంటలను రైతులు ఈ క్రాప్‌లో నమోదు చేయించుకో వాలని ఉద్యానశాఖ అధికారి ఎస్‌కే నజీరసూల్ మంగళవారం తెలిపారు.



విఘ్నేశ్వర స్వామి హుండీ ఆదాయం

నాదెండ్ల: నందికుంట విఘ్నేశ్వరస్వామి గుడికి ఒక్కరోజే రూ.87,444 హుండీ ఆదాయం లభించింది. ఈఓ తులసీదాస్ సమక్షంలో హుండీని మంగళవారం లెక్కించారు.

కాజలో శాసనాల పరిశీలన



మంగళగిరి: గుంటూరు జిల్లా కాజలో పలు శాసనాలను ప్రముఖ ఆర్కియాలజిస్టు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి మంగళవారం సందర్శించారు. పలు ఆలయాల్లోని శాసనాలను పరిశీలించారు.

న్యూస్‌రీల్

సనాతన ధర్మ రక్షకుడు ఆదిశంకరాచార్య



మంగళగిరి: మధ్యప్రదేశ్‌లోని జ్యోతిర్లింగ క్షేత్రం ఓంకారేశ్వరి నందు జగద్గురు శ్రీ ఆది శంకరాచార్య 108 అడుగుల విగ్రహం ఈనెల 21వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించనున్నట్లు తాడేపల్లి శ్రీ సత్యజ్ఞాన ఆశ్రమ అధిపతి పరమపూజ్య ప్రణవానంద భారతి స్వామి తెలిపారు. నగరంలో వేంచేసియున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారిని మంగళవారం ప్రణవానంద భారతి స్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జగద్గురు శ్రీ ఆది శంకరాచార్య సనాతన ధర్మాన్ని ఆనాడే దేశ ప్రజల హృదయాల్లో నింపి పురాణాల గురించి ప్రపంచానికి తెలియజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్యాణానంద స్వామి, శ్రీ రవి వదర్ స్వామి కేదారనాథ్, శివానంద దత్త పాల్గొన్నారు.

నేడు పీవీపాలెంలో జగనన్నకు చెబుదాం

బాపట్ల: జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం పిట్టలవానిపాలెం టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎ.వి.ఎస్.ఎన్.మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా ముఖ్య అతిథిగా హాజరై వినతులు స్వీకరించి అక్కడికక్కడే పరిష్కారమార్గం చూపుతారని వివరించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన



మంగళగిరి/గుంటూరు మెడికల్ : డాక్టర్ వైఎస్సార్ హెల్త్ కేర్ ట్రస్టు సీఈఓ ఎం.ఎన్.హరేంద్రప్రసాద్ మంగళవారం మండడం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కురగల్లు గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే చేస్తున్న సిబ్బంది రమాదేవి, వలంటీర్లతో మాట్లాడి ఏవిధంగా సర్వే చేస్తున్నారు, ఏయే పరీక్షలు చేస్తున్నారు, సిటిజన్ మొబైల్‌లో ఆరోగ్య శ్రీ యాప్ డౌన్‌లోడ్ చేశారా లేదా, ఆరోగ్య శ్రీ బ్రోచర్లు ప్రజలకు అందాయా లేదా అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. సీఈఓ వెంట గుంటూరు ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ నాగళ్ల జయరామకృష్ణ పాల్గొన్నారు.

25న మాచర్లలో స్పందన

నరసరావుపేట: ఈనెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు మాచర్లలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుర్గి, కారంపూడి, రెంటచింతల, మాచర్ల, వెల్దుర్తి మండలాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 3,612 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 156, బ్యాంక్ కెనాల్‌కు 916, తూర్పు కెనాల్‌కు 399, పశ్చిమ కెనాల్‌కు 141, నిజాంపట్నం కాలువకు 284, కొమ్మమూరు కాల్వకు 885 క్యూసెక్కులు విడుదల చేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 524.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 3,773, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 854.70 అడుగుల వద్ద ఉంది.

దసరాకు సన్నాహాలు

ఆలయ కమిటీ చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ

- 9 రోజుల్లో దుర్గమ్మకు 10 అలంకారాలు
- ఉత్సవాల్లో తొలిసారి మహాచండీ అలంకారం
- 6 లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా
- భక్తుల కోసం 20 లక్షల లడ్డూలు



మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ రాంబాబు వేదికపై ఈవో భ్రమరాంబ తదితరులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలకు సుమారు రూ.7 కోట్లతో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే దసరా ఉత్సవాల ఏర్పాట్లపై వారు మంగళవారం మీడియా సమావేశంలో వివరించారు. ఉత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు 10 విశేష అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. భక్తులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రూ.2.50 కోట్లతో ఇంజినీరింగ్ పనులు చేస్తున్నామని చెప్పారు. ఉత్సవాల్లో గతేడాది ఆరు లక్షలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటే ఈ ఏడాది అంతకు మించి తరలివస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. గత ఏడాది ఉత్సవాల్లో 16 లక్షలకు పైగా లడ్డూలను దేవస్థానం అందించిందని, ఈ ఏడాది సుమారు 20 లక్షల లడ్డూలను భక్తులకు అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు.

- ఉత్సవాల్లో ముఖ్యమైన మూలా నక్షత్రం రోజున రూ. 500 వీఐపీ టికెట్లను విక్రయించాలని దేవస్థానం నిర్ణయించింది. భక్తుల రద్దీ దృష్ట్యా అంతరాలయ దర్శనం నిలిపివేస్తారని తెలిపారు. రూ.500 వీఐపీ టికెట్ తీసుకున్నా ముఖ మండపం దర్శనం మాత్రమే కల్పిస్తామని వివరించారు. మిగిలిన రోజుల్లో రూ. 100, రూ.300, రూ. 500 టికెట్ల విక్రయాలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు సుమారు రెండు వందల మంది పని చేస్తున్నారని, భక్తుల తలనీలాలు తీసేందుకు ఇతర ఆలయాలు, బయట నుంచి సుమారు ఆరు వందల మందిని తీసుకువస్తామని తెలిపారు.

22న వేదసభ

ఉత్సవాల్లో ప్రత్యేకంగా నిర్వహించే ఆది దంపతుల నగరోత్సవం మల్లేశ్వరస్వామి ఆలయ మెట్ల వద్ద యాగశాల నుంచి ప్రారంభమవుతుందన్నారు. మహామండపం, కనకదుర్గనగర్, దుర్గాఘాట్, దేవస్థాన ఘాట్ రోడ్డు మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకుంటుందన్నారు. రాజగోపురం ఎదుట పూజతో నగరోత్సవం ముగుస్తుందన్నారు. 21న అర్చక సభ, 22న వేద సభ జరుగుతాయని పేర్కొన్నారు. ఉత్సవాల్లో చివరి రోజు 23వ తేదీ నుంచి భవానీల రాక ప్రారంభమవుతుందని భావిస్తున్నామని, మూడు రోజుల పాటు భవానీల తాకిడి ఉండే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. మీడియా సమావేశంలో పాలకమండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బచ్చు మాధవీకృష్ణ, చింకా శ్రీనివాసులు, తొత్తడి వేదకుమారి, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణశర్మ, మురళీధర్‌శర్మ, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 20న సీఎం వైఎస్ జగన్ పట్టువస్త్రాల సమర్పణ

ఉత్సవాల్లో తొలిసారిగా అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరిస్తామని దుర్గగుడి వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య పేర్కొన్నారు. తొలిరోజున అమ్మవారు శ్రీబాల త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. 20వ తేదీ మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలను సమర్పించనున్నారన్నారు. 23వ తేదీ రెండు అలంకారాల్లో అమ్మవారిని భక్తులు దర్శించుకోవచ్చునన్నారు. ఉదయం మహిషాసురమర్దని, మధ్యాహ్నం నుంచి శ్రీ రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. 23వ తేదీ సాయంత్రం శ్రీ గంగాపార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వరస్వామి వార్లకు పవిత్ర కృష్ణానదిలో తెప్పోత్సవం జరుగుతుందన్నారు.

‘గణా’పాహి.. నమో..



విశ్వనాయకుడు విఘ్నేశ్వరుడు చలువ పందిళ్లలో కొలువుదీరాడు. వివిధ రూపాల్లో కటాక్షిస్తున్న గణాధిపతి దివ్యమంగళస్వరూపాన్ని భక్తులు కనులారా తిలకించి పులకిస్తున్నారు. గణపతింభజే అంటూ కీర్తిస్తున్నారు. సోమవారం వినాయక చవితి సందర్భంగా గుంటూరు రెడ్డి హాస్టల్ దగ్గర ఏర్పాటు చేసిన చలువ పందిరిలో గణపతి విగ్రహం పక్కన వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రం పటం పెట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించిన దృశ్యాన్ని చిత్రంలో చూడొచ్చు. – సాక్షి, నెట్‌వర్క్

బీచ్‌ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- రామాపురం, సూర్యలంక బీచ్‌లపై ప్రత్యేక శ్రద్ధ
- పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

వేటపాలెం: బాపట్ల జిల్లాలోని రామాపురం, సూర్యలంక బీచ్‌లను మరింత అభివృద్ధి చేస్తామని పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పర్యాటక, రెవెన్యూ శాఖ, బ్లూఫాగ్ ఆర్కిటెక్ట్ బృందం అధికారులు శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో మంగళవారం రామాపురం, సూర్యలంక బీచ్‌లను సందర్శించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సముద్రతీర ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం శ్రద్ధ చూపిస్తోందని పేర్కొన్నారు. బ్లూఫాగ్ గుర్తింపు పొందినట్లయితే అనేక రకాల అంతర్జాతీయ వసతులతో పాటు విదేశీ పర్యాటకుల రాక పెరుగుతోందన్నారు. మత్స్యకారులకు మార్కెట్ సౌకర్యం కల్పించడం, మత్స్య సంపద ప్రదర్శనలు, క్రమపద్ధతిలో షాపుల ఏర్పాటు ద్వారా పర్యాటకులను ఆకర్షించే చర్యలు చేపడతామన్నారు. సందర్శకుల వినోదానికి సరక్షిత బోటు షికారు, ఈతకొలను వాటర్ స్పోర్ట్స్, స్కేటింగ్ చిల్డ్రన్ పార్కు, స్నానపు గదులు, ఓపెన్ జిమ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. స్థానిక ఆలయాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. శ్రీనివాసరెడ్డి వెంట సుజిత్ కుమార్, బాపట్ల తహసీల్దార్ సుధారాణి, వేటపాలెం తహసీల్దార్ అశోక్ వర్ధన్ తదితరులు ఉన్నారు.

గర్భిణుల ఆరోగ్యం కోసం కృషి



సామూహిక సీమంతాల అనంతరం గర్భిణులతో కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి

- కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి
- గర్భిణులకు సామూహిక సీమంతాలు

నరసరావుపేట: గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. మంగళవారం టౌన్‌హాలులో సమగ్ర శిశు అభివృద్ధి కేంద్రం (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో జిల్లాలోని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తోందని వెల్లడించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ గర్భిణులు మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డలు బలంగా పుడతారని, చిన్న చిన్న సమస్యలను పట్టించుకోవద్దని సూచించారు. అనంతరం సుమారు 400 మంది గర్భిణులకు శాస్త్రోక్తంగా కొత్త దుస్తులు బహూకరించి సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఎం.ఆర్.కల్పశ్రీ, ఐసీడీఎస్ పీడీ బి.అరుణ, డీఎండీహెచ్‌ఓ డాక్టర్ బి.రవి, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, నరసరావుపేట ఐసీడీఎస్ ఇన్‌చార్జి అధికారి మాణిక్యాలరావు, స్వచ్ఛాంధ్ర, ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్లు ఎస్.సుజాతాపాల్, ఇ.ఎం.స్వామి, మహిళా నాయకురాళ్లు పూనూరి కృష్ణకుమారి, ఎం.శేషమ్మ, చేగు వెంకటేశ్వరరావు, బి.లక్ష్మీపద్మలత పాల్గొన్నారు.

క్రాఫ్ట్స్ అండ్ లూమ్స్ ఎక్స్‌పో ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, జేసీ రాజకుమారి

కొరిటిపాడు(గుంటూరు): నాబార్డు ఆధ్వర్యంలో అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్స్ అండ్ లూమ్స్ ఎక్స్‌పోను జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ గోపాల్‌తో కలిసి రాష్ట్ర మార్కెటింగ్, సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత, క్రాఫ్ట్స్‌లను ప్రోత్సహిస్తోందని తెలిపారు. అధునాతన డిజైన్లతో తయారు చేసిన హ్యాండ్ లూమ్స్‌కు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని పేర్కొన్నారు. క్రాఫ్ట్స్, హ్యాండ్ లూమ్స్‌ను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు. ఇలాంటి ఎగ్జిబిషన్ల ద్వారా కళాకారులకు ఆసరా లభిస్తుందని చెప్పారు. జేసీ జి.రాజకుమారి మాట్లాడుతూ వీవర్స్, డిజైనర్స్ చక్కటి కళాకృతులను వస్త్రాలపై తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ అపురూప హస్త కళాకృతులను వీక్షించి, కొనుగోలు చేసి చేతివృత్తుల అభివృద్ధికి మనవంతు సహకారమందిద్దామని పేర్కొన్నారు. నాబార్డు సీజీఎం గోపాల్ మాట్లాడుతూ ఈ ప్రదర్శన 19 నుంచి 25వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. మంగళగిరి, ఉప్పాడ చీరలు, చీరాల చేనేత మగ్గాల దుస్తులు, కృశ్చన్ పిల్లోలు, ఆర్టిఫిషియరీ జ్యూవెలరీ ఐటమ్స్ వివిధ రకాల మట్టి వస్తువులు, అరటి నారతో చేసిన వస్తువులతోపాటు సహజసిద్ధ ఉత్పత్తులతో తయారు చేసిన ఆహార పదార్థాలు ప్రదర్శనలో ఉంచినట్టు వెల్లడించారు. జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము మాట్లాడుతూ క్రాఫ్ట్స్ అండ్ హ్యాండ్ లూమ్స్‌ను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్నమైన కార్యాచరణను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు, నాబార్డు డీడీఎం శరత్‌బాబు, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



మరణించిన రఫీ

గుంటూరు రూరల్: సరదాగా ఈతకు వెళ్లిన బాలుడు మృత్యువాత పడిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సంగడిగుంట బావాజీనగర్‌కు చెందిన షేక్ రఫీ(11) అదేకాలనీకి చెందిన తన తోటి స్నేహితులు ఏడుగురితో కలిసి బుడంపాడు వద్దగల కాలువలో ఈతకు వెళ్లాడు. అందరూ ఈత కొడుతుండగా ముగ్గురు లోతు అందక కొట్టుకుపోయారు. స్థానికులు ఇద్దరిని కాపాడారు. రఫీ అప్పటికే మునిగి పోవటంతో స్థానిక ఈతగాళ్ళు గంటకుపైగా వెతికి రఫీ మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటనపై రఫీ తండ్రి మీరావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

గణపతి నిమజ్జనంలో అపశ్రుతి

సూరేపల్లిలో విద్యార్థి మృతి



ప్రణీత్ మృత దేహం

బల్లికురవ: గణపతి నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. మట్టిగణపతిని నిమజ్జనానికి ఏబీసీ కాలువకు తీసుకెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తూ నీటి గుంతలో పడి ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ హృదయ విదారక ఘటన బల్లికురవ మండలంలోని సూరేపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన చంటి పోతిరెడ్డి, పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ప్రతాప్‌రెడ్డి పదో తరగతి, చిన్న కుమారుడు ప్రణీత్ కుమార్‌రెడ్డి (14) తొమ్మిదో తరగతి అద్దంకిలోని చైతన్య స్కూల్‌లో చదువుతున్నారు. వీరు తోటి స్నేహితులతో కలిసి సోమవారం మట్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి వినాయక చవితి పూజలు చేశారు. మంగళవారం వైదన వెళ్లే రోడ్డులో పవర్ ప్లాంట్ సమీపంలోని ఏబీసీ కాల్వలో మట్టి గణపతిని నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్లారు. ప్రణీత్ ముందుగా కాలువలో దిగాడు. ఆ సమయంలో లోతైన గుంతలో పడిపోయాడు. మిత్రుల కళ్లెదుటే మునిగిపోయాడు. స్నేహితులకు ఈత రాకపోవటంతో రక్షించలేకపోయారు. వారు పెద్దగా కేకలు వేయటంతో దూరంగా పొలాల్లో ఉన్న రైతులు వచ్చి చూడగా అప్పటికే ప్రణీత్ చనిపోయాడు. ప్రణీత్ మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

ఓటర్ల తనిఖీలో నిర్లక్ష్యం తగదు

- ఇంటింటి సర్వేలో పూర్తి సమాచారం సేకరించాలి
- మరణించిన వారి పేర్లు జాబితాల్లో ఉండరాదు
- కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశం



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాల్సిన ప్రధాన బాధ్యత మనపై ఉందని, ఈ క్రమంలో సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోనని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో చంద్రశేఖరరావు, డెప్యూటీ కలెక్టర్ సుజాత, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా రోజూ బీఎల్‌ఓలు డోర్ టు డోర్ సర్వే చేస్తున్నారన్నారు. ఇంటింటి సర్వేలో ఏమైనా ఇబ్బందులు ఉంటే రాజకీయ పార్టీల నాయకులు అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని పరిశీలిస్తారని పేర్కొన్నారు. తనిఖీ సమయంలో ప్రజాప్రతినిధులు, బూత్ ఏజెంట్లు పాల్గొని సక్రమమైన ఓటర్ల జాబితాలు తయారు చేసేలా కృషి చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తే ఇబ్బందులను, సలహాలను పరిగణలోనికి తీసుకుని నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు బీఎల్వోల పనితీరును పర్యవేక్షిస్తూ వారికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. మరణించిన వారి పేర్లను జాబితాల్లో తొలగించాలని సూచించారు.

రైతుల సంక్షేమం కోసం కృషి



వేమూరు కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో రైతులకు చెక్కులు అందజేసిన మంత్రి మేరుగ నాగార్జున, రాతంశెట్టి సీతారామాంజనేయులు

మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. వేమూరు కో–ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో పది గ్రామాల్లోని 37 మంది రైతులకు రూ.2కోట్ల 70 లక్షల విలువైన రుణాలు మంజూరు చేశారు. ఈ చెక్కులను మంగళవారం మంత్రి మేరుగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేరుగ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రూ.6 కోట్ల టర్నోవర్ కలిగిన కో–ఆపరేటివ్ బ్యాంకు ఈ ప్రభుత్వ హయాంలో రూ.17 కోట్లకు చేరుకుందని వివరించారు. సహకార సంఘాల బలోపేతానికి ప్రస్తుత ప్రభుత్వం పెద్దపీట వేయడం వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. జీడీసీసీబీ అధ్యక్షుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు (రాము) మాట్లాడుతూ జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంక్ స్థాపించి 112 ఏళ్లయిందని, బ్యాంక్ చైర్మన్ పదవిని తొలిసారి కాపులకు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని స్పష్టం చేశారు. వేమూరు ఏఎంసీ చైర్‌పర్సన్ పదవితో పాటు వేమూరు, కొల్లూరు, మండలాల్లో వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షుల పదవులూ కాపు సామాజిక వర్గానికే ఇచ్చి సీఎం ప్రోత్సహించారని కొనియాడారు. గత తెలుగుదేశం ప్రభుత్వం కాపులను మోసగించిందని ధ్వజమెత్తారు. కాపు సోదరులంతా వైఎస్సార్ సీపీ గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గాజుల భాను ప్రకాశ్, ఎంపీపీ యల్లమాటి మోహన్, సొసైటీ అధ్యక్షులు తాడికొండ బుల్లిబాబు, గాజుల మోహన్, బొల్లిముంత ఏడుకొండలు, బొల్లిముంత వెంకటేశ్వర్లు సజ్జా శ్రీనివాసరావు, దున్నా మేరీసు బాబు, తలతోటి సువర్ణరావు, వేమూరి మోషే, బొల్లిశెట్టి ప్రభాకరరావు పాల్గొన్నారు.

సీపెట్‌లో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని కేంద్ర పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) లో ఓబీసీ, ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్‌బీసీఎఫ్‌డీసీ), జాతీయ షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ) సంయుక్తంగా టెన్త్‌లో ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు కలిగిన నిరుద్యోగ యువతకు పాలిమర్స్ టెక్నాలజీలో మెషీన్ ఆపరేటర్-ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్, మెషీన్ ఆపరేటర్ అసిస్టెంట్-ప్లాస్టిక్ ప్రాసెసింగ్ కోర్సుల్లో 3-6 నెలల పాటు ఉచిత శిక్షణ కల్పించి, అనంతపురం, హైదరాబాద్ బెంగుళూరు, హోసూరు, చెన్నై తదితర ప్రాంతాల్లోని ప్రముఖ ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు, ట్రైనింగ్ కిట్, యూనిఫాం, సేఫ్టీ షూస్‌ను సీపెట్ అందజేస్తుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతలు, ఆదాయ, సామాజిక వర్గ ధ్రువపత్రాలతో పాటు ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో తమ ప్రతినిధి బాణావతు అంజినాయక్‌ను 7893586494 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

బలరామరాజుకు మహానంది పురస్కారం బహూకరణ



హైదరాబాద్‌లో మహానంది అవార్డు అందుకుంటున్న బలరామరాజు

రొంపిచర్ల: రొంపిచర్లకు చెందిన పౌరాణిక రంగస్థల కళాకారుడు చక్రవరం బలరామరాజుకు తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో మహానంది పురస్కారం లభించింది. కళారంగానికి ఆయన చేస్తున్న సేవలను గుర్తించి తెలుగు వెలుగు సాహితీ వేదిక వారు ఈనెల 17న హైదరాబాదులో జాతీయ స్థాయిలో నంది పురస్కారం బహుకరించారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక చైర్మన్ పి.రాజ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు టి.పూర్ణచంద్రాచార్యులు ఈ అవార్డు అందించారు. నంది పురస్కారం పొందిన రంగస్థల కళాకారులు చక్రవరం బలరామరాజును మంగళవారం గ్రామస్తులు కలిసి అభినందించారు. 46 సంవత్సరాలుగా రంగస్థల కళాకారుడిగా కొనసాగుతున్న ఆయన పౌరాణిక, సాంఘిక నాటకాల్లో నటించారు. ఇప్పటి వరకూ 287 సమాజాలకు బ్రహ్మంగారి, సత్యహరిశ్చంద్ర నాటకాలకు దర్శకత్వం, సంగీతం అందించారు. పౌరాణిక ఏకపాత్రలు, కరతాళమైన పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు పొందారు. నాటిక, భజన, ఏకపాత్ర పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. గతంలో జాతీయ పౌరాణిక, విశిష్ట కళారత్న పురస్కారం పొందారు. ఇటీవల పెదనందిపాడులో జరిగిన ఎన్.టి.ఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన పౌరాణిక పద్య ఏక పాత్ర పోటీల్లో పాల్గొని బహుమతి అందుకున్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనను అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ



పట్టణంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను మాత్రమే పూజించి పర్యావరణ పరిరక్షణను కాపాడాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్, గార్లపాడు బస్‌స్టాప్ సెంటర్‌లో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మంత్రి అంబటి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేయటం వల్ల జల కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. తొమ్మిదేళ్లుగా క్రమం తప్పకుండా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్న ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణని ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాల పంపిణీని మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించి పంపిణీ చేశారు. సుమారు 2 వేల మట్టి వినాయక బొమ్మల అందించినట్టు ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, కోఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి, 24, 5వ వార్డు కౌన్సిలర్లు అచ్యుత శివప్రసాద్, డాక్టర్ సలీం, దేవరశెట్టి రవికుమార్, దేవతి సుబ్బారావు, చిలకల వాసు, లోక మాధవ, షేక్ గని, శిరిగిరి వెంకట్రావు, ఆకుల హనుమంతరావు, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు స్వామి ప్రసాద్, కుమార్, యక్కల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సర్వేపై ఆర్డీఓ చర్చలు



రాజకీయపార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శేషిరెడ్డి, అధికారులు

నరసరావుపేట: డివిజన్‌లో నిర్వహిస్తున్న ఎస్ఎస్ఆర్-24 ఓటరు సర్వేపై మంగళవారం ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి తన కార్యాలయంలో పలు రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రీ-రివిజన్ కార్యకలాపాలు, గృహ సర్వే, చనిపోయిన, నకిలీలు, తరలివెళ్లిన ఓటర్లను తొలగింపు తదితర అంశాలను గురించి వివరించి, వారి సూచనలు, సలహాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈఆర్వోలైన రొంపిచర్ల, నరసరావుపేట తహసీల్దార్లు ఆర్‌వీ రమణానాయక్, శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేష్



తెనాలిఅర్బన్: ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా తెనాలికి చెందిన పాశం వెంకటేష్ ఏకగ్రీవంగా నియమితులయ్యారని ఆ సంఘ నాయకులు సోమవారం తెలిపారు. నెల్లూరులో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎన్నికను ప్రకటించినట్లు చెప్పారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు.

426 మంది ఎస్ఐ అభ్యర్థులకు అర్హత



గ్రౌండ్‌లో గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



పరుగు పందెం పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): వర్షం కారణంగా గత, ప్రస్తుత నెలల్లో వాయిదాపడిన ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం గుంటూరు పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గత నెల 25 నుంచి ఈనెల 15 వరకు ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు జరగనున్న విషయం విదితమే.. అయితే పలు తేదీల్లో వర్షాల కారణంగా వాయిదాపడగా, పునః ప్రారంభ తేదీలను ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, బాపట్ల జిల్లా వకుల్ జిందాల్ పరీక్షలను పర్యవేక్షించారు. నిర్ణీత వేళల్లో అభ్యర్థులను గ్రౌండ్‌లోకి అనుమతించారు. తొలుత అభ్యర్థుల ఒరిజినల్/ నకళ్ల ధ్రువీకరణ పత్రాలను కూలంకషంగా పోలీస్ అధికార/ సిబ్బంది పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతలను నమోదు చేసుకున్నారు. 100, 1,600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. పురుష అభ్యర్థులు 691 హాజరవ్వగా, 426 మంది ఉత్తీర్ణత సాధించారు. గుంటూరు ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, డీఎస్పీలు రవిచంద్ర (దిశ పీఎస్, పల్నాడు జిల్లా) శ్రీనివాసరావు (డీసీఆర్‌బీ), చంద్రశేఖర్ (ఏఆర్), నగరంపాలెం పీఎస్ సీఐ హైమారావు, ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, ఆర్‌ఐలు, సీఐలు, ఎస్ఐలు, మినిస్ట్రీయల్ సిబ్బంది పాల్గొన్నారు.

యార్డుకు 20,260 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 20,260 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 18,551 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,800 నుంచి 24,000 వరకు లభించింది. తాలురకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,983 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

నంది నాటకోత్సవాలకు తెనాలి నుంచి నాలుగు ప్రదర్శనలు ఎంపిక

తెనాలి: ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ, విజయవాడ ఆధ్వర్యంలో అక్టోబరులో నిర్వహించనున్న నంది నాటకోత్సవాలు-2022కు తెనాలి నుంచి నాలుగు నాటక సమాజాలు ఎంపికవటం విశేషం. ప్రాథమిక పరిశీలనలో తుది పోటీలకు ఎంపికైన నాటిక/నాటకాలను సంస్థ ప్రకటించింది. ఇందులో పద్యనాటక విభాగంలో తెనాలిలోని శ్రీదుర్గాభవాని నాట్యమండలి వారి 'శ్రీరామభక్త తులసీదాసు', సాంఘిక నాటక విభాగంలో కళల కాణాచి, తెనాలి వారి 'ఝనక్ ఝనక్ పాయల్ బాజే' ఎంపిక య్యాయి. సాంఘిక నాటికల్లో రూరల్ మండలం కొలకలూరులోని శ్రీసాయి ఆర్ట్స్ సమాజం నాటిక 'గమ్యస్థానాల వైపు' ఎంపికైంది. కొత్తగా ప్రవేశపెట్టిన కాలేజీ/విశ్వవిద్యాలయ కేటగిరీలో తెనాలిలోని ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్ థియేటర్/ అంబేద్కర్ మెమోరియల్ వారి 'మహాభినిష్క్రమణ' ఎంపికైంది.


నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణా కేంద్రం-ఐటీఐ ప్రిన్సిపాల్ బి. సాయి వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న డీఎల్‌టీసీ-ఐటీఐలో ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా టెన్త్ ఆపై విద్యార్హతలు కలిగిన అభ్యర్థులకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఎంఎస్ ఆఫీస్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కల్పిస్తామని తెలిపారు. 18 నుంచి 25 ఏళ్ల లోపు వయసు కలిగిన అభ్యర్థులు నేరుగా కళాశాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు శిక్షణాధికారి పవన్ కుమార్ (8333973929), ప్రిన్సిపాల్ సాయి వరప్రసాద్ (7386885639)ను సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో నవ వధువు మృతి

గుంటూరు రూరల్: విద్యుదాఘాతంతో నవవధువు మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన వంకాయలపాటి అనుదీప్‌కు చుట్టుగుంటకు చెందిన ప్రియాంక(19)తో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం వెంగళాయపాలెం గ్రామంలోని ఇంట్లో నీళ్ల మోటర్ స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవ శాత్తూ విద్యుదాఘాతమై పడిపోయింది. బంధువుల గమనించి తీవ్రగాయాలతో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గొర్రెల కాపరి హత్య?



సంఘటనా స్థలంలో రాంబాబు మృతదేహం

గుంటూరు రూరల్: గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెల కాపరిని హత్య చేసిన ఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం గొర్లవారిపాలెం గ్రామానికి చెందిన శాఖమూరి రాంబాబు (44) భార్య వెంకాయమ్మ ఇరువురు గొర్రెలు, గేదెలు కాసుకుంటూ జీవిస్తుంటాడు. వీరికి ఒకబాబు, పాప ఉన్నారు. రోజులానే మంగళవారం ఉదయం ఇరువురు గొర్రెలు కాసుకునేందుకు గ్రామ శివారు పొలాల్లోకి వెళ్లారు. అనంతరం సాయంత్రం 5 గంటల సమయంలో వెంకాయమ్మ ఇంటికి వెళ్లింది.

చీకటిపడినా భర్త ఇంటికి రాకపోవడం, గొర్రెలు ఇంటికి రావడంతో భర్తను వెతుకుంటూ బయల్దేరింది. గ్రామ శివారులోని ఓ ప్రైవేటు స్కూల్ సమీపంలో రక్తపు మడుగులో రాంబాబు పడి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదు. గుర్తుతెలియని వ్యక్తులు చేశారా, ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

డాక్టర్ విజయకు న్యూరాలజీ ఫెలోషిప్



న్యూరాలజి ఫెలోషిప్ అందుకుంటున్న డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్: లలితా గ్రూఫ్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయకు ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ఫెలోషిప్ లభించింది. మధురైలో సెప్టెంబరు 14 నుంచి 17 వరకు ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ 30 వార్షిక సదస్సు జరిగింది. సదస్సులో ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజి ప్రెసిడెంట్ ప్రొఫెసర్ గగన్ దీప్ సింగ్ చేతుల మీదుగా డాక్టర్ విజయ న్యూరాలజీ ఫెలోషిప్ అందుకున్నారు. దేశ వ్యాప్తంగా న్యూరాలజీ వైద్య రంగంలో విశేష సేవలందించిన ఎనిమిది మందిలో డాక్టర్ విజయ ఒకరు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా పక్షవాత రోగుల కోసం 1996లో డాక్టర్ విజయ గుంటూరులో అంకినీడు స్ట్రోక్ సెంటర్‌ను స్థాపించారు.

దేశంలోనే మొట్టమొదటి సర్టిఫైడ్ అత్యుత్తమ అత్యాధునిక సత్వర వైద్య సేవలు అందించే అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్‌గా అంకినీడు స్ట్రోక్ సెంటర్ అభివృద్ధి చేసి లక్షలాది మంది పక్షవాత రోగులకు చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. చండీఘర్‌లోని ప్రతిష్టాత్మకమైన పోస్టుగ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్) 1990లో డీఎం న్యూరాలజీ పూర్తి చేసిన విజయ, 30 సంవత్సరాల వైద్య వృత్తిలో 50 ఒరిజనల్ రీసెర్చ్ జనరల్స్ పబ్లికేషన్స్ సమర్పించారు. పది అంతర్జాతీయ అవార్డులు, అనేక జాతీయ అవార్డులు, రాష్ట్ర అవార్డులు, గోల్డ్‌మెడల్స్ గెలుపొందారు. క్లీనికల్ రీసెర్చ్ ప్రాజెక్టు ఫ్యాకల్టీగా, మోడరేటర్‌గా, చైర్‌పర్సన్‌గా, ప్యానలిస్ట్‌గా, అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు హాజరై రేడియో, టెలివిజన్ చర్చా కార్యక్రమాల్లో ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరాలు విస్తృతంగా చేస్తూ ఆమె చేస్తున్న దాతృత్వ కార్యకలాపాలకు న్యూరాలజీ ఫెలోషిప్ అందుకున్నట్లు సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ తెలిపారు.

చంద్రబాబుకు మద్దతుగా దీక్షలు చేయడం సిగ్గుచేటు

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ప్రభుత్వ ఖజానాన్ని కొల్లగొట్టి జైల్లో ఉన్న చంద్రబాబుకు మద్దతుగా టీడీపీ వారు దీక్షలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తొమ్మిదేళ్లు, ఆంధ్ర రాష్ట్రానికి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఎన్ని తెలివితేటలు ప్రదర్శించినా చట్టం ముందు అడ్డంగా దొరికిపోయారని అన్నారు. చంద్రబాబుకు మద్దతుగా టీడీపీ నాయకులు చేస్తున్న నిరసన దీక్షలు దేనికని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అప్పటి ప్రభుత్వాలు, చంద్రబాబు కుట్రపూరితంగా కేసు నమోదు చేయించి జైలుకు పంపితే చట్టం అందరికి ఒకటేనని చెప్పిన టీడీపీ నేతలు చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టారని అనడం సిగ్గుచేటన్నారు. చట్టం అందరికి సమానమేనని గుర్తు చేశారు. సీమెన్స్ కంపెనీకి సంబంధం లేకుండా రూ.371కోట్లు ప్రభుత్వ వాటా ఎవరికి ఇచ్చారని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో టీడీపీ నాయకులు ఒక్కొక్కరిగా జైలుకు వెళ్లడం ఖాయమని, అవినీతిలో లోకేశ్, అప్పటి మంత్రులపై కూడా విచారణ జరుగుతుందన్నారు. ఎంత మంది ఒక్కటైనప్పటికీ రానున్న రోజుల్లో విజయం వైఎస్సార్ సీపీదేనని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో ఉన్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని హితవుపలికారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- 23న నిర్వహించే జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: కోటప్పకొండరోడ్డులోని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల(ఎన్ఈసీ)లో ఈనెల 23వ తేదీన నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. డిపార్టుమెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) నిర్వహిస్తున్న జాబ్ మేళా బ్రోచర్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాలో మాస్టర్‌మైండ్, అఫెక్స్ సొల్యూషన్, స్కిల్ క్రాఫ్ట్, ఫ్లిప్‌కార్ట్, తోషిబా వంటి 18 రకాల కంపెనీలు హాజరై సుమారుగా 700 ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. విద్యార్హతను బట్టి జీతం సుమారుగా రూ.10 నుంచి రూ.35 వరకు ఉంటుందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ వరకు చదువుకున్న 18-45ఏళ్ల మధ్యనున్న నిరుద్యోగ యువతి యువకులు బయోడేటా, రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. నోడల్ అఫీసర్ సంజీవరావు మాట్లాడుతూ మరిన్ని వివరాలు కోసం ఎ.రమ్య: 83285 44388, ఎం.వీరాంజనేయులు : 91602 00652, వై.శ్రీనివాసరెడ్డి: 99084 82907లను సంప్రదించాలని కోరారు. ఔత్సాహిక యువతీయువకులు ముందుగా ఏపీఎస్ఎస్‌డీసీ అనే వెబ్‌సైట్‌లో తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకోసం పైన తెలిపిన నంబర్లలో సంప్రదించాలని, రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోనటువంటి యువతీయువకులు జాబ్ డ్రైవ్ జరిగే ప్రదేశంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వివరించారు.